

# చీకటి వెలుగు


సామాజిక రాజకీయ అధ్యాత్మిక సాయంకాలపు దిన పత్రిక

నల్లగొండ, హైద్రాబాద్ | సంపుటి : 19 | సంచిక :136 | ఎడిటర్ : కంది సూర్యనారాయణ | 03-10-2026 శనివారం | పేజీలు : 4 | వెల : రూ. 3



చీకటి వెలుగు దినపత్రిక
भास्कर वाणि दिन पत्रिका
విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇంచార్జీలు, ఫోటోగ్రాఫర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు, డీటీపీ ఆపరేటర్లు కావలెను
ఎడిటర్ :
కంది సూర్యనారాయణ
సెల్ : 9848052327


## గాంధీ బాటలో
# వికసిత భారత్..

బాపూజీ ఆశయాలపై మోదీ కీలక సందేశం

గాంధీజీకి ప్రధాని మోదీ నివాళులు

బాపూజీ ఆశయాలు మెరుగైన సమాజ నిర్మాణానికి దిక్సూచి అని వ్యాఖ్య

గాంధీ సిద్ధాంతాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్న మోదీ

గాంధీ జయంతి రోజున ఖాదీ ఉత్పత్తులు కొనాలని పిలుపు

లాల్ బహదూర్ శాస్త్రికీ నివాళులర్పించిన మోదీ



న్యూఢిల్లీ:జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు ఎప్పటికీ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రధానమంత్రి - మిగతా3లో

## రాష్ట్రంలో విద్యుత్
# కొరత ఉండదు..

: మంత్రి కోమటిరెడ్డి హామీ

ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి

యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు

కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందపడుతున్నాయని విమర్శ

నల్గొండకు 5,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ



తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం - మిగతా3లో

## బీజేపీ గూటికి సీరియల్ ఆర్టిస్టులు..
# ఆహ్వానించిన టీబీజేపీ చీఫ్



**హైదరాబాద్, అక్టోబర్ 2:** నగరంలోని బీజేపీ కార్యాలయంలో పలువురు సీరియల్ ఆర్టిస్టులు కాషాయం తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు.. టీవీ ఆర్టిస్ట్ వేములపల్లి స్వర్ణలత సహా పలువురు సీరియల్ ఆర్టిస్టులను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అక్రమ సంపాదనల విషయంలో ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంపాదించుకోవడం కాదు.. అసలు ప్రజలేం సంపాదించుకున్నారో ఎప్పుడైనా చెప్పారా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతి చిట్టా బయట పెడతామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా.. ఒక్కరినైనా జైలుకు పంపలేదు. అవినీతికి పాల్పడడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం కట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. తమ సమస్యను పరిష్కరించాలని గాంధీ భవన్ వద్ద ధర్నా చేస్తున్న టీచర్లను అరెస్ట్ చేసింది. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులను పట్టించుకోవాలి. బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారు. రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తోంది' అని అన్నారు.

## పాఠశాలల్లో
# అల్పాహార పథకం..

సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం

సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు

నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు

నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం

ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను - మిగతా3లో



## భారత్‌కు 114 రఫేల్
# యుద్ధవిమానాలు..



### కొనుగోలు ప్రక్రియ వేగవంతం!

**ఇంటర్నెట్ డెస్క్:** భారత వాయుసేనను పటిష్ఠం చేయడంలో భాగంగా 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలు ప్రక్రియ ముందుకు సాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం(2027 మార్చి) ముగిసేలోగా దీనిపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశముందని కేంద్ర రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తెలిపారు. రఫేల్ విమానాల తయారీలో అధిక స్థాయిలో స్వదేశీకరణతో పాటు భారతీయ ఆయుధాలు, వ్యవస్థలను అనుసంధానించడంపై దృష్టి పెట్టినట్టు ఆయన వివరించారు. ఈ కొనుగోలు ప్రక్రియ 'బై అండ్ మేక్' విధానంలో సాగనుందని, ఇందులో అధిక సంఖ్యలో రఫేల్ విమానాలను భారత్‌లోనే అసెంబుల్ చేయనున్నారని రాజేశ్ తెలిపారు. ఇప్పటికే రఫేల్ మెరైన్ విమానాల్లో భారతీయ ఆయుధాల అనుసంధానానికి అంగీకారం లభించిందని ఆయన అన్నారు. 114 రఫేల్ జెట్ల కోసం ఆహ్వానించిన ప్రతిపాదనలపై(ఆర్ఎఫ్‌పీ) బిడ్లు అందాయని, ప్రస్తుతం వాటిని అధికారికంగా పరిశీలిస్తున్నామని చెప్పుకొచ్చారు.మరోవైపు.. తేజస్ ఎమ్‌కే2 అభివృద్ధి కూడా కొనసాగుతోందని రక్షణశాఖ కార్యదర్శి తెలిపారు. వచ్చే ఏడాది మధ్యలో - మిగతా3లో

## గాంధీకి వ్యతిరేకంగా
## ఉన్న గాడ్సే భావజాలాన్ని
# తిప్పికొట్టాలి

గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి..

గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు..

గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన..

అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు..



గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి - మిగతా3లో



## తెలంగాణలో 12 ఏళ్ల తర్వాత
## సవరించిన
# ఆటో ఛార్జీలు

**హైదరాబాద్, అక్టోబరు 2:**తెలంగాణలో సామాన్యులపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో రిక్షా ఛార్జీలను పెంచుతూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత ఈ ఛార్జీలను సవరించడం గమనార్హం. నూతన ఛార్జీల ప్రకారం, కనీస ఛార్జీని (తొలి 1.6 కిలోమీటర్లకు) రూ.30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు.ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ ఛార్జీలను కూడా సవరించారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య సాధారణ ఛార్జీపై ఒకటిన్నర రెట్లు అధికంగా వసూలు చేస్తారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే సమయానికి (వెయిటింగ్ ఛార్జీలు) నిమిషానికి 75 పైసలుగా ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొత్త ఛార్జీలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా పాత, కొత్త ఛార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డులను ఆటోల్లో తప్పనిసరిగా - మిగతా3లో

# హైదరాబాద్‌లో యువ వైద్యురాలు అనుమానాస్పద మృతి

**మియాపూర్‌లో సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో యువ వైద్యురాలి మృతి**

**అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు**

**మూడు రోజుల క్రితం స్నేహితుడితో హైదరాబాద్ వచ్చినట్టు గుర్తింపు**

**ఫోన్ అందుబాటులో లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు**

**పరారీలో ఉన్న స్నేహితుడి కోసం కొనసాగుతున్న గాలింపు**



హైదరాబాద్‌లో ఓ యువ వైద్యురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్‌పేట్ ఆదిత్య నగర్‌లోని ఓ ప్రైవేట్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవారం ఈ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతురాలు (27) సంగారెడ్డి జిల్లాకు చెందిన యువతి. మహబూబ్‌నగర్‌లో వైద్య విద్యను అభ్యసించిన ఆమె, ఇటీవల వరంగల్‌లో పీడియాట్రిక్స్‌లో పీజీ పూర్తి చేశారు. మూడు రోజుల క్రితం తన స్నేహితుడైన ఓ యువకుడితో కలిసి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఆమె, ఇక్కడ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో బస చేశారు. కుమార్తె ఫోన్ అందుబాటులోకి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, ఆమె మొబైల్ లొకేషన్‌ను ట్రేస్ చేశారు. అనంతరం శుక్రవారం మియాపూర్ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు సదరు సర్వీస్ అపార్ట్‌మెంట్‌కు చేరుకుని పరిశీలించగా, అప్పటికే ఆమె అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉంది. ఈ ఘటనపై మియాపూర్ సీఐ జయరాం మాట్లాడుతూ, మృతురాలితో పాటు ఉన్న యువకుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాట్లు వెల్లడించారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించామని, పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని వివరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు .

## సంపాదకీయం

### కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్...

అమెరికా వెళ్లాలి.. డాలర్ డ్రీమ్స్ నెరవేర్చుకోవాలి' అని భారత్‌లోని సగటు యువతలో చాలామంది ఆశపడుతూ ఉంటారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ అక్కడి విదేశీ విద్యార్థులు, యువత ఆశలపై నీళ్లు చల్లడం ప్రారంభించారు.ఒకప్పుడు ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో మీా.. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించేలా చేస్తున్నాయి.ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంతకాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.అమెరికాలో మీా కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది.ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై దృష్టి పెడుతున్నారు.క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు. విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగం దొరికితే.. ఆ తర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు.కానీ ఇక్కడా సవాళ్లు తప్పడం లేదు!విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి.ఒకప్పుడు కొన్ని కాలేజీలకు 50 నుంచి 80 వరకు కంపెనీలు వచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది.క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి.దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది.ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు.ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు.అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది.హెచ్-1బీ వీసా చార్జీలు అనూహ్యంగా పెంచడమే కాక, విద్యార్థి వీసాలపై వచ్చే వారిపై కఠిన నిబంధనలు విధించారు. దీంతో అక్కడ ఉంటున్న ఇండియన్స్ సహా ఇతర దేశస్థులకు ఉద్యోగ అవకాశాలు తగ్గడమే కాక, ఆ దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది.హెచ్-1బీ వీసా కింద నియామకాలు తగ్గించి స్థానికులనే నియమించుకోవడం మెల్లిగా ప్రారంభించాయి. డాలర్ల సంపాదన లక్ష్యానికి ట్రంప్ దెబ్బకొట్టడంతో అమెరికాకు వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. పోనీ ఎలాగోలా వెళ్దామని దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది విద్యార్థుల వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. వీసాల తిరస్కరణ డాటాను పరిశీలిస్తే.. ప్రాంతాల వారీగా వాటిలో అసమానతలు పెరుగుతున్నాయన్న విషయం వెల్లడవుతున్నది. దీనివల్ల అమెరికాలో విద్యావకాశాలు యోగ్యత, ప్రతిభ కంటే భౌగోళిక పరిస్థితుల వల్లే ఎక్కువగా ప్రభావితమవుతున్నాయా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.అమెరికా విద్యావకాశాల విషయంలో ప్రాంతీయఅంతరం పెరుగుతున్నదని ఒక నివేదిక వెల్లడించింది. భారత దేశం సహా పాకిస్థాన్, నేపాల్, ఫిలిప్పీన్స్, కెన్యా, బ్రెజిల్, మెక్సికో, వియత్నాం, అర్జెంటీనా లాంటి గ్లోబల్ సౌత్ దేశాల నుంచి వచ్చే విద్యార్థి వీసా దరఖాస్తుదారులు, యూరప్, ఉత్తర అమెరికా నుంచి వచ్చే వారితో పోలిస్తే అధిక తిరస్కరణను ఎదుర్కొంటున్నారు.భారత స్టూడెంట్ల వీసా తిరస్కరణ ఇలా2023- 36%, 2024-53%, 2025-61% 2025 ఫిబ్రవరి నాటికి అమెరికాలో 3,78,787 మంది మన విద్యార్థులు ఉండగా, 2026 ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 3,52,644కు తగ్గిపోయింది.మొత్తంగా చూస్తే.. అమెరికా కలకు పూర్తిగా తెరపడకపోయినా, ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాధాన్యతలు మాత్రం మారుతున్నాయి. విదేశీ విద్య కోసం భారీ రిస్క్ తీసుకోవడం కంటే.. ముందుగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవడానికే కొత్త తరం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది.

# జనసేన వైపు వైసీపీ ద్వితీయ శ్రేణి నేతలు




**విజయవాడ, అక్టోబరు 2:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున జనసేన పార్టీ వైపు క్యూ కడుతున్నారు. పవన్ కళ్యాణ్ నాయకత్వంపై నమ్మకంతో పాటు, ఏపీ సర్కార్‌లో ఉప ముఖ్యమంత్రిగా ఆయన పెంచుకున్న రాజకీయ గ్రాఫ్ ఈ చేరికలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రతిపక్షం నుంచి నాయకులు వరుసగా వచ్చి చేరుతుండటం వల్ల జనసేనకు రాజకీయంగా కొత్త ఊపు, ఒక బలమైన పొలిటికల్ మూమెంటం లభిస్తోంది. అయితే, ఈ చేరికలు పార్టీని నిజంగా ఒక ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిగా మారుస్తాయా? లేక కేవలం తాత్కాలిక హడావుడికే పరిమితమవుతాయా ? ఏ రాజకీయ పార్టీకైనా నాయకులు, కేడర్ వరుసగా రావడం అనేది ప్రజాక్షేత్రంలో సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. వైఎస్సార్‌సీపీ నుంచి నేతలు జనసేనలోకి రావడం ద్వారా రాష్ట్రంలో భవిష్యత్తు జనసేనదే అన్న అభిప్రాయం ప్రజల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ బలపడుతోంది. ఇది పార్టీ ఇమేజ్‌ను పెంచడానికి, ద్వితీయ శ్రేణి కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి ఉపయోగపడుతుంది. ఈ చేరికల వల్ల రాజకీయ మూమెంటం వచ్చినప్పటికీ, జనసేన ప్రస్తుతం టిడిపి-జనసేన-బీజేపీ అధికార కూటమి లో భాగంగా ఉంది. ఒక పార్టీ అధికార కూటమిలో ఉంటూ సొంతంగా ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని, స్వతంత్ర ప్రత్యామ్నాయ శక్తిని ఆక్రమించడం సాధ్యం కాదు. ప్రభుత్వం సాధించే విజయాల్లో భాగస్వామ్యంతో పాటు, ప్రభుత్వ వ్యతిరేకత వస్తే దాని ప్రభావం కూడా జనసేనపై పడుతుంది. అందువల్ల ఎంతమంది నాయకులు చేరినా, కూటమి పరిధిలోనే పవన్ కళ్యాణ్ రాజకీయం చేయాల్సి ఉంటుంది.ఎంతమంది వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు , దిగ్గజ నాయకులు జనసేన కండువా కప్పుకున్నా, ఎన్నికల సమయానికి వచ్చేసరికి పొత్తుల ధర్మం ప్రధాన అడ్డంకిగా మారుతుంది. కూటమి ఒప్పందం ప్రకారం జనసేనకు పరిమిత సంఖ్యలోనే స్థానాలు దక్కే అవకాశం ఉంటుంది. దాంతో, కొత్తగా చేరిన సీనియర్ నేతలందరికీ టికెట్లు కేటాయించడం పవన్ కళ్యాణ్‌కు కత్తిమీద సాములా మారుతుంది. టికెట్లు దక్కని నాయకులు మళ్లీ అసంతృప్తికి గురై పార్టీ మారే లేదా తిరుగుబాటు చేసే ప్రమాదం కూడా ఉంది. జనసేనలో ఈ చేరికలు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలంటే, ఆ పార్టీ భవిష్యత్తులో కూటమి నుంచి బయటకు వచ్చి ఒంటరిగా పోటీ చేసే పరిస్థితి కి ఎదగాలి. కూటమికి అతీతంగా, రాష్ట్రంలో ముఖ్యమంత్రి పీఠం లక్ష్యంగా జనసేన ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా మారినప్పుడే ఈ నేతల చేరికలు నిజమైన సీట్లుగా, ఓట్లుగా మారతాయి. లేకపోతే, టీడీపీ కేటాయించే కొన్ని సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది.మరో కీలకమైన అంశం ఏంటంటే.. మొదటి నుంచీ పవన్ కళ్యాణ్ వెంట ఉండి, పార్టీ కోసం కష్టపడిన జనసైనికులు , సిద్ధాంతపరమైన కార్యకర్తలు ఉన్నారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ నుంచి వస్తున్న నాయకులు ఎక్కువ భాగం అధికారంలో ఉండగా ప్రయోజనాలు పొందినవారే. అకస్మాత్తుగా పార్టీలోకి వచ్చిన కొత్త నాయకులకు ప్రాధాన్యత ఇస్తే, పాత కేడర్‌లో అసంతృప్తి రగిలే అవకాశం ఉంది. ఈ పాత-కొత్త నేతల మధ్య సమన్వయం కుదర్చడం జనసేన అధిష్టానానికి పెద్ద పరీక్షగా మారనుంది వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలోకి వరుస చేరికలు పార్టీ వృద్ధికి మంచి సంకేతమే అయినా, అది కేవలం పొలిటికల్ మూమెంటం వరకే పరిమితమవుతుంది. పవన్ కళ్యాణ్ తన పొత్తుల వ్యూహాన్ని, భవిష్యత్ రాజకీయ ప్రణాళికను స్పష్టంగా రూపొందించుకుంటే తప్ప, ఈ నాయకుల బలం సీట్ల రూపంలోకి మారడం కష్టం. కూటమి పరిమితులను దాటుకొని జనసేన తన సొంత జెండాపై ఏ మేర అధికారాన్ని డిమాండ్ చేయగలదనే దానిపైనే ఈ చేరికల అసలు ఫలితం ఆధారపడి ఉంటుంది.

# సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి..

**రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి':అనంత్ అంబానీ**

**ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌తో రైతులను సీఈఓలుగా మారుస్తామన్న అనంత్**

**ఏపీలో రూ.1 లక్ష కోట్లతో సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్న రిలయన్స్**

**ఏఐ, డ్రోన్ల టెక్నాలజీతో రైతులకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని వెల్లడి**

**అనంత్ ప్రసంగానికి మంత్రముగ్ధులైన నేతలు**

**ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న సీఎం చంద్రబాబు**



**మదనపల్లె:**రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం" అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తన ప్రసంగంలో చారిత్రక, జాతీయ అంశాలను ప్రస్తావిస్తూ.. జాతీయ గీతాన్ని రవీంద్రనాథ్ టాగూర్ మదనపల్లెలోనే ఆంగ్లంలోకి అనువదించారని గుర్తుచేశారు. గాంధీజీ సర్వోదయ, అంత్యోదయ నినాదాలను, లాల్ బహదూర్ శాస్త్రి 'జై కిసాన్', వాజ్‌పేయి 'జై విజ్ఞాన్', ప్రధాని మోదీ 'జై అనుసంధాన్' నినాదాలను ఉటంకిస్తూ.. ఈ నాలుగు నినాదాల కలయికతోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ పనిచేస్తుందని వివరించారు. టెక్నాలజీ సాయంతో రైతుల ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు లక్ష్యానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని అనంత్ ప్రకటించారు. "ఏఐ, డ్రోన్లు, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో ప్రెసిషన్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తాం. మదనపల్లె టమాటో రైతులు తమ ఉత్పత్తులను ఎప్పుడు, ఎక్కడ అమ్ముకోవాలో చెప్పే వ్యవస్థను రూపొందిస్తాం. రిలయన్స్ గ్రీన్ బిజినెస్ ద్వారా అన్నదాతలను 'ఊర్జాదాతలు' (శక్తి ప్రదాతలు)గా మారుస్తాం" అని తెలిపారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటుకు దేశవ్యాప్తంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెడుతున్నట్లు వెల్లడించారు. 'కియో కృషి' ద్వారా రైతులకు జియో పూర్తి సహకారం అందిస్తుందని, 'దేశ్ సేవా-కిసాన్ సేవా' తమ నినాదమని స్పష్టం చేశారు. 'పశు సేవా హీ ప్రభు సేవా' అని తాను విశ్వసిస్తానని, 'వంతారా' ద్వారా జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏపీలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అద్భుతంగా ఉందని, అందుకే రాష్ట్రం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని కొనియాడారు.

# ఘనంగా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు...

**గోదావరిఖని :** గాంధీ జయంతి, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ. ముస్తఫా ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తాలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి మరియు మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ హాజరై మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగర మేయర్ మహంకాళి స్వామి , డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య యాదవ్ , కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ. ముస్తఫా , కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మహనీయులను స్మరించుకున్నారు.

**గాంధీజీ, శాస్త్రిజీల ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకం**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ , మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కేవలం ఒక వ్యక్తి కాదని, సత్యం, అహింస అనే ఆయుధాలతో ప్రపంచానికి కొత్త మార్గాన్ని చూపిన మహోన్నత శక్తి అని కొనియాడారు. 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన గాంధీజీ, దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కుల కోసం పోరాడి, అనంతరం భారతదేశానికి తిరిగి వచ్చి స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారని గుర్తుచేశారు. సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి మహత్తర ఉద్యమాల ద్వారా దేశ ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చి స్వాతంత్ర్య పోరాటానికి కొత్త దిశను చూపారని తెలిపారు. అదేవిధంగా భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరత, నిజాయితీ, దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని అన్నారు. సాధారణ కుటుంబం నుంచి ఎదిగి దేశ ప్రధానమంత్రి స్థాయికి



చేరుకున్న శాస్త్రి , తన సరళమైన జీవితం, నిస్వార్థ సేవ, అంకితభావంతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. దేశం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో సైనికుల ధైర్యాన్ని, రైతుల కృషిని దేశ నిర్మాణానికి సమానంగా గుర్తించిన శాస్త్రి "జై జవాన్ -- జై కిసాన్" అనే నినాదాన్ని దేశానికి అందించారని తెలిపారు. సరిహద్దుల్లో దేశాన్ని కాపాడే సైనికుడు, దేశానికి అన్నం అందించే రైతు ఇద్దరూ దేశానికి వెన్నెముకలని చాటి చెప్పిన మహానేత శాస్త్రి గారని అన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం, మత సామరస్యం వంటి ఆశయాలతో పాటు శాస్త్రిజీ చూపిన నిజాయితీ, నిరాడంబరత, దేశభక్తి, రైతులు--సైనికుల పట్ల గౌరవం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. మహనీయుల జయంతులను కేవలం వేడుకలుగా నిర్వహించడం కాకుండా, వారి ఆశయాలను ఆచరణలో పెట్టడమే వారికి అందించే నిజమైన నివాళి అని అన్నారు. నేటి యువత గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జీవితాలను ఆదర్శంగా తీసుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాదరబోయిన రవికుమార్, బొంతల రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, తిప్పారపు శ్రీనివాస్, కార్పొరేటర్లు గట్ల రమేష్, నెలకంటి రాము, చుక్కల లావణ్య శ్రీనివాస్, ధూళికట్ట సతీష్, ఫజల్, మాటూరి సత్య ప్రసాద్, వడ్లూరి రవి, సాగి సంతోష్ రావు, శంకర్ నాయక్, కొమ్ము స్వప్న వేణు, కన్నూరి భాగ్యలక్ష్మి శంకర్, తిప్పారపు మానస శరత్, సహజ రాజేందర్, ఆసిఫ్ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలు భాస్కర్, పంజా శ్రీనివాస్, నజీమొద్దీన్, మొహీన్, గఫూర్, మారుపాక శంకర్, ఆడెపు రవి, గుండేటి శంకర్, నర్సోజీ, యాద వెంకటరమణ, మాజీ కార్పొరేటర్లు, ఎస్సీ సెల్, బీసీ సెల్, మైనారిటీ సెల్, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ , మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హీరో పైలట్ స్మిత్‌కు

# ప్రధాని మోదీ ఫోన్ కాల్..

**ఆరోగ్య పరిస్థితిపై ఆరా**

**174 మంది ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ**

**స్మిత్ ధైర్య సాహసాలను కొనియాడి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

**యూఏఈ ఆసుపత్రిలో కోలుకుంటున్న పైలట్**

**ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు**

**భారత రాయబార కార్యాలయం పూర్తి సహాయం అందిస్తోందని వెల్లడి**

ఫ్లైదుబాయ్ విమానంలో కాక్‌పిట్‌లో ప్రాణాపాయ దాడిని ఎదుర్కొని, 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ధైర్య సాహసాలను మనస్ఫూర్తిగా ప్రశంసించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైన కెప్టెన్ స్మిత్ సాహసాన్ని, ఆయన చూపిన సమయస్ఫూర్తిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్.. విమానంలో జరిగిన భయానక ఘటన గురించి ప్రధానికి వివరించారు. మత ఛాందసవాదిగా భావిస్తున్న కో-పైలట్ దాడిని ఎదుర్కొనే ధైర్యం తనకు ఎలా వచ్చిందో తెలిపారు. అంతకుముందు గురువారం కూడా ప్రధాని మోదీ.. స్మిత్ కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆయన సాహసాన్ని కొనియాడారు. భారత ప్రభుత్వం, విదేశాంగ మిషన్లు పైలట్‌కు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నాయని ప్రధాని వారికి భరోసా ఇచ్చారు. **ఆరోగ్యం నిలకడగా ఉంది: భారత రాయబారి**

ప్రస్తుతం యూఏఈలోని ఆసుపత్రిలో కోలుకుంటున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. యూఏఈలో భారత రాయబారి దీపక్ మిట్టల్.. స్మిత్ మచ్చర్‌ను, ఆయన కుటుంబాన్ని ఆసుపత్రిలో పరామర్శించారు. "ఆయన మాతో స్వేచ్ఛగా మాట్లాడారు. నవ్వుతూ, ఉల్లాసంగా కనిపించారు. ఇది మాకు, ముఖ్యంగా ఆయన కుటుంబానికి ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది" అని రాయబారి తెలిపారు. స్మిత్‌కు అత్యుత్తమ వైద్యం అందుతోందని, యూఏఈ అధికారులతో భారత రాయబార కార్యాలయం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని మిట్టల్ వివరించారు. దాడి జరిగిన తర్వాత సౌదీ అరేబియా నుంచి స్మిత్‌ను ప్రత్యేక విమానంలో దుబాయ్‌లోని ఆసుపత్రికి తరలించారు. "కెప్టెన్ స్మిత్ ఎంతో ధైర్యాన్ని, సాహసాన్ని ప్రదర్శించి పెను విషాదాన్ని నివారించారు. ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడారు. భారతదేశపు ఈ వీర పుత్రుడిని చూసి మేం గర్విస్తున్నాం. ఆయనకు పూర్తి సహకారం అందిస్తాం" అని అంతకుముందు ఒక ఇంటర్వ్యూలో మిట్టల్ పేర్కొన్నారు.





# ఒకేరోజు 4 స్వర్ణాలు..

**ఆసియా గేమ్స్ 2026లో అదరగొట్టిన భారత బాక్సర్లు, రెజ్లర్లు**

**న్యూఢిల్లీ అక్టోబరు 2:**ఆసియా క్రీడల్లో భారత్ ఒకేరోజు 4 స్వర్ణాలు సాధించింది. ప్రస్తుతానికి భారత్ 75 పతకాలు సాధించగా.. అందులో 15 గోల్డ్, 25 రజతాలు, 35 కాంస్యాలు ఉన్నాయి. భారత రెజ్లర్ సుజీత్ ఆసియా క్రీడల్లో అద్భుతం చేశారు. ఒలింపిక్ ఛాంపియన్ ను ఓడించి, ఆ తరువాత ఫైనల్ పోరులోనూ నెగ్గి బంగారు పతకం అందుకున్నాడు. పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ విభాగంలో స్వర్ణ పతకం సుజీత్ సాధించాడు. ఫైనల్ పోరులో సుజీత్ తజికిస్థాన్‌కు చెందిన అబ్దుల్మాజిద్ కుదీవ్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రారంభంలో వెనుకంజలో ఉన్నప్పటికీ అద్భుతంగా పుంజుకుని 10-9 తేడాతో ఉత్కంఠ పోరులో విజయాన్ని నమోదు చేశాడు.

గోల్డ్ మెడల్ మ్యాచ్ కంటే ముందు భారత రెజ్లర్ సుజీత్ కలకల్ ఒలింపిక్ ఛాంపియన్‌ను మట్టికరిపించాడు. సుజీత్ ఒలింపిక్ ఛాంపియన్ కొటారో కియోకాను 3- 3 తేడాతో (స్కోరు సమం కావడంతో, టెక్నికల్ రూల్స్ ఆధారంగా) ఓడించి పురుషుల 65ఎన్త్ర కేటగిరీ ఫైనల్లో అడుగుపెట్టాడు. ఆ తర్వాత ఫైనల్లోనూ అదే జోరు ప్రదర్శిస్తూ చారిత్రాత్మక స్వర్ణ పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.గోల్డ్ మెడల్ మ్యాచ్ కంటే ముందే సుజీత్ అతిపెద్ద సంచలనాన్ని నమోదు చేశాడు. ఒలింపిక్ ఛాంపియన్‌ను ఓడించినప్పుడే ఆయన ఛాంపియన్ అవుతాడని అంతా భావించారు. అయితే, సుజీత్‌కు గోల్డ్ మెడల్ మ్యాచ్ అంత ఈజీగా రాలేదు. తజికిస్థాన్‌కు చెందిన అబ్దుల్మాజిద్ కుదీవ్‌తో జరిగిన గోల్డ్ మెడల్ పోరులో సుజీత్ మొదట వెనుకంజలో ఉన్నాడు. చివరికి పుంజుకుని సుజీత్ 10-9 తేడాతో విజయాన్ని సాధించి భారత్ ఖాతాలో మరో స్వర్ణ పతకాన్ని చేర్చాడు. సుజీత్ ఒక దశలో 2-9 తేడాతో వెనుకంజలో ఉన్నప్పటికీ.. ఊహించని రీతిలో పుంజుకుని వరుసగా 8 పాయింట్లు సాధించి విజయం సాధించి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు.

**చిత్తుగా ఓడించి గోల్డ్ మెడల్**

భారత బాక్సర్ అంకుష్ పంగాల్ 80 కిలోల విభాగం ఫైనల్లో నెగ్గి స్వర్ణ పతకాన్ని అందుకున్నాడు. గోల్డ్ మెడల్ కోసం జరిగిన ఫైనల్ పోరులో దక్షిణ కొరియా బాక్సర్ కిమ్ మిన్‌సాంగ్‌ను 4-0 తేడాతో చిత్తు చేశాడు. ఆసియా క్రీడలు 2026లో భారత్‌కు ఇది 14వ స్వర్ణం. ఆ తరువాత ఒక్క నిమిషంలోనే సుజీత్ 15వ స్వర్ణాన్ని కూడా అందించాడు. 26 ఏళ్ల బాక్సర్ అంకుష్ పంగాల్ ఫైనల్లో కొరియా బాక్సర్‌ను ఓడించాడు. అంతకుముందు సెమీఫైనల్లో ప్రారంభంలో వెనుకబడినప్పటికీ అద్భుతంగా పుంజుకుని ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ఫజ్లిద్దీన్ ఎర్కిన్‌బోయెవ్‌ను 4-1 తేడాతో ఏకపక్ష పోరులో ఓడించాడు. 75 కేజీల విభాగంలో ప్రస్తుత వరల్డ్ ఛాంపియన్ కావడం విశేషం.

**చరిత్ర సృష్టించిన అంకుష్**

2018 ఆసియా గేమ్స్ తర్వాత ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన తొలి భారత పురుష బాక్సర్‌గా అంకుష్ పంగాల్ నిలిచాడు. ఆయన కంటే ముందు బాక్సింగ్‌లో చివరి స్వర్ణ పతకాన్ని అమిత్ పంగాల్ 2018లో గెలిచాడు. అంకుష్ పంగాల్ హర్యానాలోని హిసార్ ప్రాంతానికి చెందిన బాక్సర్. అతడి తండ్రి కబడ్డీ ప్లేయర్.. దాంతో క్రీడలపై అతడికి ఆసక్తి ఏర్పడింది. అంకుష్ కబడ్డీలో జిల్లా స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాడు. కానీ తన తండ్రి సూచనతో బాక్సింగ్ రింగ్ లోకి అడుగుపెట్టాడు. శిక్షణ కోసం తన గ్రామం నుండి 15 కిలోమీటర్లు వెళ్లేవాడు. తండ్రి స్వయంగా తీసుకెళ్లి ప్రాక్టీసు తరువాత మళ్లీ ఇంటికి తీసుకొచ్చేవారు. 2018లో హర్యానా స్టేట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఓటమి తర్వాత బాక్సింగ్ కూడా వదిలేయాలనుకున్నాడు. కానీ తన తండ్రి అలా చేయకుండా నచ్చజెప్పి ప్రోత్సహించారని తెలిపాడు. నేడు అంకుష్ ఆసియా క్రీడల్లో సాధించిన ఈ గోల్డ్ మెడల్ వెనుక అంకుష్ తండ్రి కష్టం, త్యాగాలు కూడా ఉన్నాయి.

**భారత బంగారాలు మహిళా బాక్సర్లు లవ్లీనా, పర్వీన్ హుడా**

భారత బాక్సర్లు లవ్లీనా, పర్వీన్ హుడా స్వర్ణాలు సాధించారు. తొలుత లవ్లీనా 75 కేజీల విభాగంలో చైనాకు చెందిన బావో జియుపై గెలుపొందింది. ఆసియా గేమ్స్ లో బాక్సింగ్‌లో గోల్డ్ సాధించిన సాధించిన రెండో భారత మహిళా బాక్సర్‌గా లవ్లీనా నిలిచింది. తర్వాత 65 కేజీల విభాగంలో పర్వీన్ అద్భుతం చేసింది. చైనీస్ తైపీ బాక్సర్ నీన్ చిన్ చెన్‌పై 3-2 తేడాతో నెగ్గి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది.

## పాఠశాలల్లో అల్పాహార పథకం..

- మొదటి పేజీ తరువాయి

లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

- మొదటి పేజీ తరువాయి

ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## గాంధీ బాటలో వికసిత భారత్..

మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోదీ అన్నారు. సత్యం, అహింస, నిరాడంబరత, స్వదేశీ భావనలతో కూడిన బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన బాటలో నడుస్తూ మెరుగైన సమాజంతో పాటు వికసిత భారత్ నిర్మాణం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మహాత్ముడికి నివాళులర్పించిన మోదీ.. ఆయన సందేశాలను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని.. బాపూజీ శాశ్వత సందేశం మెరుగైన సమాజం, వికసిత భారత్ నిర్మాణానికి నిరంతరం దిశానిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. గాంధీజీ జీవితం సత్యం, అహింస, కరుణ, సేవలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి కాలంలోనూ మానవాళికి ఆయన జీవితం మార్గం చూపుతుందని అన్నారు. వీడియో సందేశంలోనూ గాంధీజీ గొప్పతనాన్ని మోదీ వివరించారు. అక్టోబరు 2 ప్రాధాన్యం దేశంలోని ప్రతి చిన్నారికీ తెలుసని అన్నారు. అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ కోట్లాది మంది ప్రజల హృదయాల్లో గాంధీజీ ఇప్పటికీ నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన సిద్ధాంతాల ప్రభావం మానవాళిపై ఉన్నంతకాలం ఆ ఆశయాలు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని తెలిపారు.గాంధీజీ స్వదేశీ భావనకు ఎంతో ప్రాధాన్యమిచ్చారని, ఖాదీ దానికి ప్రధాన చిహ్నమని ప్రధాని గుర్తుచేశారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. స్వదేశీ వస్తువులను గర్వంగా వినియోగించాలని పిలుపునిచ్చారు.లాల్ బహదూర్ శాస్త్రికీ నివాళులు..: దేశ రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన్ను కూడా ప్రధాని మోదీ స్మరించుకున్నారు. ఆయన నిరాడంబరత, దేశం పట్ల అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని విజయ్‌ఘాట్ వద్ద శాస్త్రి సమాధికి నివాళులర్పించారు. 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో సైనికులు, రైతుల్లో కొత్త స్ఫూర్తి నింపిన గొప్ప నాయకుడని కొనియాడారు. బయటకు ఎంతో నిరాడంబరంగా కనిపించినా.. సంకల్పంలో మాత్రం లాల్ బహదూర్ శాస్త్రి రాతిలా దృఢంగా ఉండేవారని మోదీ గుర్తుచేశారు. రైతులు, సైనికుల సహకారంతో దేశం విజయాలు సాధించేందుకు శాస్త్రి చూపిన మార్గం చిరస్మరణీయమని అన్నారు.

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు..

మొదటి పేజీ తరువాయి

గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలో 12 ఏళ్ల తర్వాత సవరించిన ఆటో ఛార్జీలు

- మొదటి పేజీ తరువాయి

ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది.చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2014 ఫిబ్రవరిలో ఆటో ఛార్జీలను సవరించారు. వాహనాల కొనుగోలు వ్యయం, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు, బీమా, డ్రైవర్ల జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ఛార్జీలు పెంపును సిఫారసు చేస్తూ ప్రభుత్వ నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ సిఫారసుల మేరకే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో, టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల కోసం కామన్ పాస్‌ను ప్రారంభించిన రోజే ఈ ఛార్జీల పెంపు ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

## భారత్‌కు 114 రఫేల్ యుద్ధవిమానాలు..

- మొదటి పేజీ తరువాయి

తొలి విమాన ప్రయోగం నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. ప్రొటోటైప్‌లు సిద్ధమైన తర్వాత భారత వాయుసేన వాటిని పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రంగ సంస్థ హెచ్ఏఎల్ సహా ప్రైవేట్ సంస్థలు, ఎంఎస్ఎంఈలకూ గణనీయమైన భాగస్వామ్యం ఉంటుందని వివరించారు. ఇక.. ఐదో తరం యుద్ధ విమానాల గురించి రాజేశ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం విదేశీ ప్రాజెక్ట్‌ను చేపట్టే ఆలోచనలేవీ లేవని స్పష్టం చేశారు. భారత్ స్వయంగా అభివృద్ధి చేస్తున్న అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఏఎమ్‌సీఏ)పైనే దృష్టి ఉందన్నారు. దాని కోసం ఎంపిక చేసిన సంస్థల నుంచి ఆర్ఎఫ్‌పీలను ఆహ్వానించామని, క్లిష్టమైన ప్రాజెక్ట్ కావడంతో సంస్థలు మరింత సమయం కోరాయని ఆయన తెలిపారు.

# కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు అశోక చక్ర!



**న్యూఢిల్లీ:** హైదుబాయ్ పైలట్ స్మిత్ మచ్చర్‌ను అశోక చక్ర అవార్డుతో సత్కరించే ఆలోచనలో భారత ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళు తున్న విమానాన్ని కోపైలట్ కూల్చేందుకు ప్రయత్నించగా.. ఆ కుట్రను భగ్నం చేసిన భారత పైలట్ స్మిత్ మచ్చర్‌ను అశోక చక్ర అవార్డు వరించే అవకాశాలు ఉన్నాయి. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించే వారిని అశోక చక్ర అవార్డుతో సన్మానించే విషయం తెలిసిందే. సుమారు 180 మంది ప్రాణాలను కాపాడిన మచ్చర్‌పై ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యహూ కూడా ఆ పైలట్‌ను ఓ హీరోగా కీర్తించారు. గుజరాతీ మూలాలు ఉన్న ఆ పైలట్‌కు ఇప్పటికే గుజరాతీ సర్కారు విశిష్ట్ గుజరాత్ గిరిమా అవార్డును ప్రకటించింది. అతని ధైర్యసాహసాలను మెచ్చుకున్నది. సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించింది. మచ్చర్ త్వరగా కోలుకోవాలని కాశీ విశ్వనాథ్ ఆలయంలో కూడా పూజలు చేశారు. ఒకవేళ మచ్చర్‌కు అశోక చక్ర ప్రదానం చేస్తే, అప్పుడు ఆ అవార్డును గెలుచుకున్న రెండో ఏవియేషన్ వ్యక్తిగా ఆయన నిలుస్తారు. 1987లో పాన్ ఆమ ఫ్లయిట్ 73లో సీనియర్ ఫ్లయిట్ పర్సర్‌గా చేసిన నీరజ్ భానోత్‌కు గతంలో అశోక చక్ర ఇచ్చారు. హైజాక్ అయిన ఫ్లయిట్‌లోని ప్రయాణికుల్ని రక్షించిన ఆయన తన ప్రాణాలను త్యాగం చేశారు. ప్రస్తుతం మచ్చర్ కూడా తెగువ చూపించినట్లు ప్రశంసలు కురుస్తున్నాయి.

# గులాబీ కోటలను బద్దలు కొడతారా..



**కరీంనగర్, అక్టోబరు 2:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయ కంచుకోటగా భావించే సిరిసిల్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన అధికారిక అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ బహిరంగ సభ మార్పు సంకేతాలు ఇచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ నిర్వహించే ఏ సభకైనా యంత్రాంగం, నిధుల అండతో జనాన్ని సమీకరించడం సహజమే అయినప్పటికీ.. సిరిసిల్ల సభకు తరలివచ్చిన జనసందోహంలో ఒక ఆర్గానిక్ ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనిపించింది. బలవంతపు తరలింపులకు, స్వచ్ఛందంగా తరలివచ్చే ప్రజా స్పందనకు మధ్య ఉండే విభజన రేఖ ఈ సభలో స్పష్టంగా రుజువైంది. కేటీఆర్‌కు ఎదురేలేదని భావించిన స్వంత గడ్డపైనే ఇంతటి భారీ స్థాయిలో కాంగ్రెస్ బలప్రదర్శన విజయవంతం కావడం గులాబీ శిబిరాన్ని ఆత్మరక్షణలోకి నెట్టింది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి సుదీర్ఘంగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్‌పై స్థానికంగా యాంటీ-ఇన్‌కంబెన్సీ నెమ్మదిగా బలపడుతోందన్న సంకేతాలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఉద్యమ సెంటిమెంట్ పూర్తిగా కనుమరుగైపోవడంతో.. ప్రజలు ఇకపై కేవలం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, క్షేత్రస్థాయి పాలన, నేత అందుబాటులో ఉండే తీరు, చేనేత-రైతు సంక్షేమ హామీల అమలు ఆధారంగానే తమ రాజకీయ తీర్పులను నిర్ణయించే వాస్తవికతలోకి వచ్చారు. గత పదేళ్లలో ఐటీ హబ్‌లు, హైటెక్ మౌలిక వసతుల పేరిట జరిగిన ప్రచారం క్షేత్రస్థాయి సామాన్యుల జీవితాలను ఎంతవరకు మార్చిందనే ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ బాధితుల సమస్యలు, నేతన్నల ఆత్మహత్యల నివారణలో గత ప్రభుత్వ వైఫల్యాలు ఇప్పటికీ పచ్చిగానే ఉండటం స్థానిక అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది. ఈ ప్రజా వ్యతిరేకత కేవలం అసెంబ్లీ సభతోనే మొదలుకాలేదు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనే దీనికి స్పష్టమైన సంకేతాలు కనిపించాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు భారీ మెజారిటీ లభించడం కేటీఆర్ రాజకీయ ఆధిపత్యానికి పడిన మొదటి గట్టి ఎదురుదెబ్బ. బండి సంజయ్‌కు 73 వేల ఓట్లు వస్తే , బీఆర్ఎస్ అభ్యర్థికి 65వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. కేటీఆర్ తన సొంత ఇలాకాలోనే ఆధిక్యాన్ని కాపాడుకోలేకపోయారన్న నిజం.. ఓటర్ల మైండ్‌సెట్ మారిపోయిందనడానికి తిరుగులేని ఆధారంగా నిలిచింది. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు ఏకపక్ష మద్దతు ఇచ్చిన ఓటర్లు క్రమంగా బీజేపీ వైపు మొగ్గు చూపడం ప్రారంభించగా.. ఇప్పుడు ఆ రాజకీయ శూన్యంలోకి కాంగ్రెస్ వేగంగా చొచ్చుకువెళ్లేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తుగడలు సిరిసిల్ల రాజకీయాలను మునుపటి కేటీఆర్ వర్సెస్ ఇతరులు స్థాయి నుంచి మార్చి, కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ ప్రధాన పోరుగా తీర్చిదిద్దే దిశగా సాగుతున్నాయి. గత లోక్ సభ ఎన్నికల ఫలితాలతో రెండో స్థానానికి వెళ్లిన బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సంక్షేమ పథకాలను రేవంత్ సిరిసిల్లాపై కేంద్రీకరిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, స్థానిక వర్గాలకు భరోసా ఇస్తూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలమైన సంస్థాగత పునాదులను ఏర్పాటు చేస్తోంది. ఈ సభ ద్వారా రేవంత్ రెడ్డి వేసిన తొలి అడుగు భవిష్యత్తులో మరింత దూకుడుగా మారనుందని, కేటీఆర్‌ను ఆయన సొంత గడ్డపైనే రాజకీయంగా కట్టడి చేసేందుకు కాంగ్రెస్ దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు వెళ్తోందని స్పష్టమవుతోంది.

# రేవంత్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి...

**ఎంపీ రఘునందన్ రావు డిమాండ్**

**రేవంత్, కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు రఘునందన్ డిమాండ్**

**సోమవారం లోగా లేఖ రాయాలని, లేదంటే తానే రాస్తానని వెల్లడి**

**తన ఆస్తిపైనా విచారణకు సిద్ధమని ప్రకటించిన బీజేపీ ఎంపీ**



**సంగారెడ్డి :** తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల విచారణ సవాళ్లు మరింత ముదురుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని నేతలు దొంగలేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ తమ ఆస్తులపై విచారణ కోరుతూ సోమవారం లోగా హైకోర్టుకు లేఖ రాయాలని రఘునందన్ సవాల్ విసిరారు. ఒకవేళ వారు స్పందించకపోతే, తానే స్వయంగా హైకోర్టుకు లేఖ రాస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ముగ్గురం కలిసి సిట్టింగ్ జడ్జికి విచారణ కోసం విజ్ఞప్తి చేద్దామని, తన ఆస్తులపైనా విచారణకు తాను సిద్ధమేనని ప్రకటించారు. ఇటీవల సిరిసిల్ల సభలో కేటీఆర్ ఆస్తుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేయగా, దానికి ప్రతిగా తమ ఇద్దరి కుటుంబాల ఆస్తులపైనా న్యాయ విచారణ జరిపించాలని కేటీఆర్ సవాల్ చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ కూడా ఈ అంశాన్ని తెరపైకి తేవడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించాలి

**కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున**



**చీకటి వెలుగు నల్లగొండ, అక్టోబర్ 2:** కుల వివక్షకు వ్యతిరేకంగా, దళితులు, గిరిజనులు, పేదల హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, అవసరమైన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోసంఘం జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు.

**62 రకాల కుల వివక్షలను వెలుగులోకి తెచ్చిన ఉద్యమం**

1998 అక్టోబర్ 2న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న 62 రకాల కుల వివక్ష రూపాలు వెలుగులోకి వచ్చాయని నాగార్జున తెలిపారు. ఈ వివక్షలకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల ఫలితంగా అసెంబ్లీలో చర్చ జరిగి, వివిధ సమస్యల పరిష్కారానికి సంబంధించి 106 ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద నిధుల కేటాయింపు, దళితుల స్మశాన వాటికలకు భూమి కేటాయింపు వంటి అంశాల్లో సంఘం పోరాటాలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. జస్టిస్ పున్నయ్య కమిషన్, కోనేరు రంగారావు కమిటీ సిఫారసుల అమలుతోపాటు దళితులు, గిరిజనులు, పేదల హక్కుల కోసం కెవిపిఎస్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. అయినప్పటికీ నేటికీ కులం పేరుతో దూషణలు, దాడులు, హత్యలు, కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు కొనసాగడం ఆందోళనకరమన్నారు. భూమి, గట్టు వంటి వివాదాల్లోనూ దళితులు వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించాలి.**

సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచడంతోపాటు నాణ్యమైన భోజనం, దుస్తులు, ప్లేట్లు, గ్లాసులు, తాగునీరు, ఇతర కనీస సౌకర్యాలు కల్పించాలని నాగార్జున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గాది లింగస్వామి, లెక్చరర్ కవి లింగమూర్తి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గాదె నరసింహ, సహాయ కార్యదర్శులు కోడిరెక్క మల్లన్న, బొల్లు రవీంద్రకుమార్, ఒంటెపాక కృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి కిరణ్‌కుమార్, బొంగురాల వెంకటయ్య, శంకర్, లింగస్వామి, నరేష్, నాగన్న, రాంబాబు, నాగరాజు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు



**మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్**

గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ గారి అధ్యక్షతన మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ గారు మాట్లాడుతూ, ప్రజలందరికీ గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి శుభాకాంక్షలు తెలిపారు. మహాత్మా గాంధీజీ చూపిన అహింస, శాంతి మార్గాలు, లాల్ బహదూర్ శాస్త్రి గారి నిజాయితీ, దేశభక్తి, "జై జవాన్ -- జై కిసాన్" నినాదం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. "ఈ మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆదర్శాలను మన రోజువారీ జీవితంలో ఆచరించడమే మనం వారికి అందించే నిజమైన నివాళి" అని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీ గోసిక వినయ్‌తో పాటు కౌన్సిలర్లు శ్రీ కొనసం రాజేష్ రెడ్డి, శ్రీమతి పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, శ్రీమతి పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, శ్రీ బద్రి గాలయ్య, శ్రీమతి దేప రమ్య రాజు, శ్రీ పాక చిరంజీవి, శ్రీమతి ఉడుగు జ్యోతి రమేష్, శ్రీమతి బత్తుల జయమ్మ దాసు, శ్రీమతి చింతల ఉమామహేశ్వరి సాయిలు, శ్రీ బుడ్డా సురేష్, శ్రీ పిల్లలమర్రి మధుసూధన్, శ్రీ హన్ను మహమ్మద్ పాల్గొన్నారు. అలాగే కో-ఆప్షన్ సభ్యులు శ్రీ పస్తం గంగరాములు, శ్రీ మహమ్మద్ బాబా షరీఫ్, శ్రీమతి షేక్ నబీబి జానీ బాబా, పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రీకాంత్, భరత్, బిల్ కలెక్టర్లు బుచ్చి రాములు, ఉపేందర్, రవి, శ్యామ్, ఇన్‌వార్డ్ సిబ్బంది సునీత, భాస్కర్, అరవింద్, జవాన్ అంజయ్య, వంశీ తదితర మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొని మహనీయులకు నివాళులర్పించారు.

# శాంతియుత పోరాటాల ద్వారా సామాజిక మార్పు సాధించడమే గాంధీజీ ఆశయం

**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**



మహాత్మాగాంధీ అనుసరించిన ప్రజాస్వామిక శాంతియుత పోరాట కార్యాచరణ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తనకు స్ఫూర్తిగా నిలిచిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. ప్రజాస్వామిక హక్కుల సాధనకోసం గాంధీజీ అనుసరించిన సత్యాగ్రహ పంథా నేటి యువతరానికీ ఆచరణీయమన్నారు. గాంధీ జయంతి సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం వారి త్యాగనిరతని స్మరించుకుంటూ ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. న్యాయమైన ప్రజల ఆకాంక్షల కోసం, నిరంకుశ ప్రభుత్వాల మీద పోరాడే నాయకత్వం, విశాల దృక్పథంతో తమ పోరాట కార్యాచరణను రూపొందించుకోవాలనే తాత్వికతను గాంధీజీ జీవితం నుంచి నేర్చుకోవాల్సి ఉన్నదని కేసీఆర్ అన్నారు. పీడితులందరినీ సమన్వయం చేసుకుంటూ, భావజాల వ్యాప్తిని చేస్తూ, శాంతియుత పోరాటంలో భిన్న వర్గాలను ఐక్యసంఘటన శక్తిగా తీర్చిదిద్దుకోవాలనే గాంధీజీ ఆశయాలను ప్రతీ ఒక్కరు అనుసరించాలన్నారు. తెలంగాణ సాధన కోసం తాను ఒంటరిగా ముందడుగు వేసిన నాటినుంచి నేటి వరకు ఎన్ని కష్టాలొచ్చినా తాను స్థిత ప్రజ్ఞతతో అనుసరిస్తున్న కార్యాచరణలో గాంధీజీ స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ స్పష్టం చేశారు. విద్వేష పూరిత ప్రసంగాలను, కక్షపూరిత వైఖరులను విడనాడి, ప్రజల నడుమ శాంతి సౌభ్రాతృత్వం పరిఢవిల్లేలా పాలనను కొనసాగించడం ద్వారా మాత్రమే జాతిపిత మహాత్మాగాంధీకి మనం నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

# గాంధీజీ విగ్రహానికి మంత్రి కోమటిరెడ్డి నివాళులు



**నల్లగొండ:** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని గాంధీజీ విగ్రహానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీజీ దేశానికి అందించిన అహింస, సత్యాగ్రహం, శాంతి మార్గాలను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఆయన సూచించారు.

# ఉర్సు ఉత్సవాల సందర్భంగా ఘనంగా అన్నదానం



**చీకటి వెలుగునల్లగొండ:** లతీఫుల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం గుట్ట మెట్ల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముతవల్లి సమీయుల్లా ఖాద్రి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు ఆయన మాట్లాడుతూ2,000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించామని అన్నారు. ఉర్సు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు సేవ చేయడం సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రాత్రి నిర్వహించిన అజ్మతే ఔలియా కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కళాకారులు ఉర్దూ భాషలో లతీఫుల్లా షా ఖాద్రి గొప్పతనం, మహిమ, ఔన్నత్యాన్ని భక్తులకు వివరించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆధ్యాత్మిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో ముతవల్లీలు గౌస్ ఖాద్రి, సల్మాన్ ఖాద్రి, జమాల్ ఖాద్రి, ఉర్సు కమిటీ ఉపాధ్యక్షులు హషం, మసీయుద్దిన్, నిర్వాహకులు జయబాబు, ఫిరోజ్, నవీన్, సమద్, ఉమర్, తాహీర్, ఎజాజ్, పాషా తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ దీక్షకు పూర్తి మద్దతు..

**మాజీ ఎమ్మెల్యే కంచర్ల**



**చీకటి వెలుగు నల్గొండ:** నేడు... నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయం లో తెలంగాణ బ్రాహ్మణ ఐఖ్య వేదిక తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల ఐఖ్య వేదిక సంయుక్తంగా...తలపెట్టిన తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ .. యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించిన నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కంచర్ల మాట్లాడుతూ.. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ యాత్ర చేపట్టటం ... చాలా మంచి కార్యక్రమం అని.. ఏ అసెంబ్లీ వద్ద మహిళా శాసనసభ్యులకు అవమానం జరిగిందో అక్కడ నుండే ఈ యాత్ర ప్రారంభిస్తే.. బావుంటుందని సూచించారు. గత కెసిఆర్ ప్రభుత్వంలో బ్రాహ్మణులకు అత్యంత ప్రాధాన్యత గౌరవం దక్కిందని 100 కోట్లతో బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేశారని పేద బ్రాహ్మణ విద్యార్థులకు విదేశీ విద్య కొరకు 20 లక్షలు ఇచ్చారని.. ధూప దీప నైవేద్య స్కీం కింద మొదట ఆరు వేలు ఆ తర్వాత పదివేలకు వారి గౌరవ వేతనాలు పెంచారని... కెసిఆర్ ప్రభుత్వ హాయంలో సంతోషంగా ఉన్నాయని... తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల ఐక్యవేదిక.. కలిసి చేస్తున్న తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ దీక్ష యాత్రకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని... ఉద్యమాల ఖిల్ల నల్లగొండ గడ్డపై నుండి.. ఈ యాత్ర ప్రారంభించడం మీకు విజయాన్ని చేకూరుస్తుందని.. అన్ని బ్రాహ్మణ సంఘాలు కలిసి ఐక్యంగా ముందుకు పోవాలని.. తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలియజేశారు. తెలంగాణ బ్రాహ్మణ సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ యజ్ఞం పవన్ కుమార్ శర్మ దేవులపల్లి రంగారావు గంప రామ శర్మ కిరణ్ కుమార్ శర్మ, కంచనపల్లి రవీందర్రావు గుడా జయరావు,గూడా రాజేశ్వరరావు నారపరాజు రజనీరావు జ్యోతి కులకర్ణి చకిలం వేణుగోపాలరావు కందాల శ్రీనివాసాచార్యులు పసునూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# బాపూ ఘాట్‌లో డిజిటల్ మ్యూజియంను గవర్నర్ తో కలిసి ప్రారంభించిన ముఖ్యమంత్రి



జాతిపిత మహాత్మా గాంధీ గారి జయంతి సందర్భంగా లంగర్‌హౌస్‌లోని బాపూ ఘాట్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తో కలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మహాత్ముడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూ ఘాట్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ మ్యూజియంను గవర్నర్ తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు పొన్నం ప్రభాకర్ , పొంగులేటి శ్రీనివాస రెడ్డిరు, మహమ్మద్ అజారుద్దీన్ , ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే, ప్రభుత్వ సలహాదారులు వీ హనుమంత రావు , హర్కర వేణుగోపాల్ , ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్ , రామచంద్ర నాయక్ ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , డీజీపీ సీవీ ఆనంద్ , ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by **KANDI SURYA NARAYANA,** Printed at Parthasarathi Offset Printers, Prakasham Bazar, Nalgoda - 508 001, T.G
Editor : **KANDI SURYA NARAYANA,** D.No. 5-6-109/B1, Bottuguda Nalgonda-508 001, T.G. Cell : 98480 52327, , **Email : cheekativelunewsdaily@gmail.com**